

# రచయితతో భేటీ

ప్రశ్న: మీరు వ్రాసే ప్రతి నవలలోనూ ఎక్కువగా పారిశ్రామిక వేత్తల గురించి వ్రాస్తుంటారు. దేశం బాగు పడాలన్నా, చెడిపోవాలన్నా వీరి చేతుల్లోనే ఉందని తెలియజేయటానికా? లేక మరేదైనా కారణం ఉందా?

—శక్తినాథ్, బాపట్ల

పారిశ్రామిక వేత్తల గురించి వ్రాసింది ఎర్ర సముద్రం, త్రినేత్రుడు లోనే. దేశం బాగుపడాలంటే ఒక్క పారిశ్రామికవేత్త చేతిలోనే లేదు. రాజకీయవేత్త సహకారం కూడా కావాలి.

ప్రశ్న: నేనో పోస్ట్ గ్రాడ్యుయేట్ని. ఉద్యోగం కోసం చెప్పులరిగేలా ఎన్నో ఆఫీసుల చుట్టూ తిరిగాను. జీవితంపై విసుగు కలిగి ఇక జీవితాన్నే చాలిద్దామను కున్నాను. మీ నవల చదివాక నాకలాంటి ఆలోచన వచ్చినందుకు నాపై నాకే అసహ్యం వేసింది. ఏదైనా వ్యాపారం చేయాలన్నా డబ్బులేదు. ఎలా పెట్టుబడి సంపాదించాలి?

—ఎమ్.ఆర్.కె., తాడిపత్రి

చేతిలో చిల్లిగవ్వ లేదంటున్నారు గనుక- ముందు పెట్టుబడి పెట్టవలసిన వ్యాపారం గురించి కొన్నాళ్ళు మీ ప్రయత్నాలు ఆపండి. మీ సర్వీస్ను అమ్ముకుంటూ నాలుగు డబ్బులు కూడబెట్టుకోండి. ఉదా: డబ్బుండి కూడా టైమ్, శ్రద్ధ లేక బిల్లులు కట్టడం, పన్నులు చెల్లించటం, వాహనాలని సర్వీస్ చేయించటం లాంటి పనుల్ని చేసుకోలేక పోతున్న కుటుంబాల్ని కలవండి. ఆ సర్వీసుల్ని అందించటమే వ్యాపారమని చెప్పండి. మీరే మరో నలుగురి కుర్రాళ్ళని మీ క్రింద పెట్టుకోండి. డబ్బున్న వారి కాలానికి మీరు మీ సేవలతో విలువ కట్టండి. కచ్చితంగా మీరు అభివృద్ధిలోకి వస్తారు.

ప్రశ్న: ప్రపంచంలో కార్లు ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశం ఏది? అలాగే ప్రపంచంలో మోటార్ సైకిళ్ళు ఎక్కువ తయారుచేసే దేశం? కంపెనీ?

—గోగినేని శ్రీనివాసరావు, కాకుమాను

జపాన్- ఒక్క జపాన్లోనే తొమ్మిది పెద్ద కంపెనీలు కార్లను ఉత్పత్తి చేస్తున్నాయి. మోటర్ సైకిళ్ళు ఎక్కువ తయారు చేసే దేశం కూడా జపానే. ప్రపంచంలో మోటర్ సైకిళ్ళు ఎక్కువ తయారు చేసే కంపెనీ హోండా (జపాన్).

ఆ షాక్ నుంచి ఇంకా ఎవరూ తేరుకోలేదు.

త్రినాథ్ చటుక్కున లేచి క్షణాల్లో బయటకు దూసుకుపోయాడు.

* * *

"అవ్యక్తమైన ఆరాటపు ముసుగు నీడల్లో, అవమానపు లోతుల్లో నన్ను నేను పనికిరానితనానికి అప్పచెప్పేసు కున్నాను. నేనెందుకు? ఎవరివలన ప్రయాణమయ్యానో మరచిపోయి నన్నల్లుకున్న కన్నతల్లి ఇంద్రజాలానికి కట్టుబడిపోయి ఘోరమైన పొరపాటు చేశాను. ఈ ప్రపంచంలో ఏ శిష్యుడు ఏ గురువుకు చేయరాని ద్రోహం చేశాను. గురుదక్షిణ చెల్లించుకోలేని విశ్వాస ఘాతకుడ్ని అయ్యాను. క్షమించమని అడిగే అర్హత గురుదక్షిణ చెల్లించినవారికే. కాని వినరాని మాట విన్నాను. నరాలు కాలసర్పాలై పోయాయి అతని మాటలు విన్నప్పుడు - అతను మీకు భర్త నన్నాడు ... నిజం కాదుగదా? ఒక్క మాట చెప్పండి - వాడ్ని హతమార్చనని - నా దైవసమానులైన మిమ్మల్ని అవమానించినవాడ్ని వదిలి వేస్తానని నేనెవరికి ప్రమాణం చేయలేదు ... చెప్పండి" త్రినాథ్ గుండెలోతుల్లోంచి వచ్చాయా మాటలు.

ఆమె షాక్ తినలేదు అతని మాటలువిని. ఆమెకు తెలుసు అతన్ని సుదర్శన్రావు జైలు నించి విడిపించి చివరి అస్త్రంగా ఉపయోగించుకుంటాడని. అసలంత వరకు సుదర్శన్రావుని అధః పాతాళానికి అణగ ద్రొక్కక పోవడమే తను చేసిన పొరపాటని క్షణకాలం అనుకుంది.

బోను తలుపు ఎత్తబోతూ క్షణకాలం ఆగిన తన మాస్టర్ కేసి చూసే సింహం చూపుల్లా వున్నాయి త్రినాథ్ చూపులిప్పుడు.

"నిజమే ... వాడు నాకు తాళికట్టిన వాడే - కాని భర్త కాదు ..."

త్రినాథ్ మెదడులో విస్ఫోటం ... ఆమె తిరిగి చెప్పడం ప్రారంభించింది —

ముగింపు
వచ్చేవారం

# షాక్

అది సుదర్శనరావు యిల్లు. సుదర్శనరావు, యోగేష్, ప్రియాంక ఎవరికి వారే టెన్షన్గా ఫీల్ అవుతున్నారు. "ఇరవై నాలుగు గంటలలో కరెంట్ కనెక్షన్స్ తీసివేయిస్తాను కాసుకో" అని త్రినాథ్ సవాల్ విసిరి అప్పుడే యిరవై గంటలు అయింది. ఇంకా నాలుగు గంటలు మాత్రమే గడువు వున్నది. ఒక ప్రక్క తండ్రికి ధైర్యం చెబుతున్నా చివరి క్షణాంలో టెలిఫోన్ లైన్ డిస్కనెక్ట్ చేయడం గుర్తుకు వచ్చి లోలోన భయపడుతోంది ప్రియాంక. ఎ.సి. రూంలో వున్నా అందరికి ఒంటి నిండా చెమట పడుతోంది. ఇంతలో కరంటు పోయింది. అంతే సుదర్శనరావు బి.పి. వచ్చి పడిపోయాడు. తండ్రి అవస్థ చూసి ప్రియాంక ఒక నిర్ణయానికి వచ్చి వెంటనే తన తండ్రి దగ్గర వుండే గూండాలను త్రినాథ్ మీదకు పంపింది.

* * * *

త్రినాథ్ ఆఫీసులో అటూయిటూ పచార్లు చేస్తున్నాడు. ఎదురుగా హిందూ, బోస్ తమ బాస్ ఏం నిర్ణయం తీసుకోబోతున్నాడో అని ఎవరికి వారే ఆలోచిస్తున్నారు. వేరే పని మీద వెళ్ళిన గుప్తాజీ ఇంకా రాలేదు. తను సుదర్శనరావుకు ఇచ్చిన టైం అయిపోవచ్చింది. "తను సుదర్శనరావు మీద ఓడిపోబోతున్నాడు" అని తలచుకుంటేనే కోపం వస్తోంది.

అదే సమయంలో ప్రియాంక పంపిన గూండాలు త్రినాథ్ ఆఫీసు మీద పడ్డారు. త్రినాథ్, బోస్ కొదమ సింహాలవలె విజృంభించి వాళ్ళను ఎదుర్కొన్నారు. తన్నులు తిని అందరూ పారిపోగా ఒకతను దొరికాడు. కారణం అడిగితే తమను సుదర్శనరావు కూతురు ప్రియాంక 'కరెంటు కనక్షన్స్ తీసివేయటం వలన త్రినాథ్ను చంపమని పంపినదని' చెప్పాడు. అది విని బోస్, హిందూ ఆశ్చర్యపోయి బాస్ వంక చూశారు. త్రినాథ్ కూడా ఆశ్చర్యపోయినా బయటకు తెలియనీయకుండా వెంటనే ఎలక్ట్రిసిటీ ఆఫీసుకు ఫోను చేసి వాళ్ళు చెప్పినది విని, తనలో తాను నవ్వుకొంటూ ఎదురుగా నిలబడ్డ హిందూ, బోస్లతో "సుదర్శనరావు ఏరియా వాళ్ళకు ఆ రోజు నుండి కరెంటు కోత మొదలు పెట్టారట" అన్నాడు. షాక్ అవ్వటం వీళ్ళ వంతయింది.

\- శ్రీనివాస్ వాకా